విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com
# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 336 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూన్ 2025 | వెల : రూ 10/-



## ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు

- ఒకేరోజు 600మంది ఫోన్ల ట్యాప్
- నక్సల్స్ సానుభూతిపరుల పేరుతో ట్యాప్
- జాబితాలో రేవంత్, ఈటెల,అరవింద్ , రఘునందన్ రావు
- మరోమారు విచారణకు హాజరైన ప్రభాకర్ రావు

హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్న తరుణంలో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు మరోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. నాలుగో సారి సిట్ ముందు హాజరైన ఆయనను మరింత లోతుగా -మిగతా 3 లో

### రాష్ట్ర అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్న




# బీఆర్ఎస్

### పదేళ్ల అధికారంలో ఉండగా అప్పులు చేసి పోయారు

- కరెంట్ అప్పులు కూడా నెత్తిన వేశారు
- డిమాండ్‌కు తగ్గకుండా విద్యుత్ సరఫరా చేశాం
- భూపాలపల్లి జిల్లాలో పలు అభివృద్ధి పథకాలకు భట్టి శ్రీకారం
- సౌర విద్యుత్ ప్రాజెక్టుల్లో మహిళలకు భాగస్వామ్యం: శ్రీధర్ బాబు



జయశంకర్ భూపాలపల్లి,

రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే బిఆర్ఎస్ పార్టీ ఓర్వలేకపోతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి ఆరోపించారు. 10 ఏళ్ల అధికారంలో ఉన్న టీఆర్ఎస్ నేతలు బయటకి వచ్చినప్పుడు తమపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం సంపాదించిన ప్రతి రూపాయిని ప్రజలకు ఖర్చు పెట్టాలనే ఆలోచన చేస్తుంది.. గతంలో సంపాదించిన ప్రతి రూపాయిని దోచాలని ఆలోచనతో ఉండేవాళ్లు అని ఆయన ఎద్దేవా చేశారు. అందుకే ఈ రాష్ట్రం అభివృద్ధి జరగలేదు, ఇక్కడ ప్రజల-మిగతా 3 లో

## 42శాతం బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం

- అంతవరకు విశ్రమించేది లేదు
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత



మెదక్

బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు సాధించుకుంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. బీసీలంతా చైతన్యం కావాలని కోరారు. కామారెడ్డిలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల సమయంలో ప్రకటించిన డిక్లరేషన్ సాధించే వరకు పోరాడుతామని అన్నారు. మంగళవారం మెదక్ జిల్లాలో -మిగతా 3 లో





## గోదావరి-బనకచర్ల పై కీలక నిర్ణయం

- నేడు ఏంపీలతో ప్రభుత్వం సమావేశం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్

గోదావరి-బనకచర్ల లింక్‌ప్రాజెక్టు విషయంలో వపక్షాల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తదుపరి అనుసరించాల్సిన కార్యాచరణ కోసం తెలంగాణ ఎంపీలతో రాష్ట్ర ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా -మిగతా 3 లో



## ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

- ఆపరేషన్‌లో ఆదివాసీలే హతమవుతున్నారు
- ఇది ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం
- మావోలతో వెంటనే శాంతి చర్చలు జరపాలి
- ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాలో మేధావుల పిలుపు

హైదరాబాద్

ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు -మిగతా 3 లో

### వందలాది కాంగ్రెస్ నేతల

# ఫోన్లు ట్యాప్


### ఈ వ్యవహారంలో కేటీఆర్ సిగ్గుతో తలదించుకోవాలి

- 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్‌తోనే కాంగ్రెస్ ఓటమి
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట వాంగ్మూలం ఇచ్చిన టీపీసీసీ మహేష్ కుమార్



హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ సిగ్గుతో తలదించుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆనాడు అధికారంలో ఉన్న కేసీఆర్, కేటీఆర్‌లు వేలాదిమంది కాంగ్రెస్ నేతల ఫోన్లు టాప్ చేశారని అన్నారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసుల ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం టీపీసీచీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఓటమికి -మిగతా 3 లో



## యోగాతో ప్రపంచ ఐక్యతా స్ఫూర్తి

### యోగా సందేశంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,

యోగా అనేది కేవలం వ్యక్తిగత ఆరోగ్యం గురించి మాత్రమే కాకుండా, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ ఐక్యతా స్ఫూర్తిని నెలకొల్పడానికి కూడా తోడ్పడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ మేరకు యోగా దినోత్సవ సందేశంతో కూడిన లేఖను ప్రధాని విడుదల చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు యోగా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 'చారిత్రాత్మక యోగా ప్రస్థానం విజయవంతంగా 10 సంవత్సరాలు -మిగతా 3 లో

## భాషల ఆధారంగా దేశాన్ని విభజించలేం




- భారత్ ఆకాంక్షలతో కూడుకున్న దేశం
- భాషల ఆధారంగా విభజన జరగడం సరికాదు
- భాషా వివాదం నుంచి బయటపడాలి
- ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్

పుదుచ్చెరి-.

భారత్ ఆకాంక్షలతో కూడుకున్న దేశమని, భాషల ఆధారంగా విభజన జరగడం సరికాదు అని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ తెలిపారు. దేశ భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకుని, -మిగతా 3 లో

## జి7 సదస్సును విడిన ట్రంప్




- పశ్చిమ ఆసియాలో మరింత ఉద్రిక్తత
- హుటాహుటిన స్వదేశం యూఎస్‌కు ట్రంప్

వాషింగ్టన్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హడావుడిగా స్వేదశం బయలుదేరి వెళ్లారు. కెనడా వేదికగా జరుగుతున్న జీ7 వేదికను వీడి అమెరికాకు తిరుగు ప్రయాణం కావడంతో.. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. టెహ్రాన్ గగనతలాన్ని పూర్తిగా అధీనంలోకి తీసుకొన్నామని ఇజ్రాయెల్ ప్రకటించిన వేళ.. ఈ పరిణామాలు చోటుచేసుకొన్నాయి. -మిగతా 3 లో

# తక్షణమే టెహ్రాన్‌ను ఖాళీ చేయండి..

## -ఇరాన్ ప్రజలకు ట్రంప్ వార్నింగ్



**వాషింగ్టన్**
ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరడంతో టెహ్రాన్‌ను తక్షణమే ఖాళీ చేయాలని ఇరాన్ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. అణు ఒప్పందంపై ఇరాన్ సంతకం చేసి ఉండాల్సిందని, ఇప్పుడు ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఇది ఎంత సిగ్గుమాలిన చర్య అన్నారు. మరింత ఆలస్యం కాకముందే ఇజ్రాయెల్‌తో సమస్యను తగ్గించుకోవాలని సూచించారు. కెనడాలో జరుగుతున్న జీ7 సదస్సుకు ట్రంప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంపై స్పందిస్తూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.'నేను చెప్పిన అణు ఒప్పందంపై ఇరాన్ సంతకం చేసి ఉండాల్సింది. ఇప్పుడు ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇది ఎంత సిగ్గుమాలిన చర్య. ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. ఇప్పటికే పదే పదే చెప్పా. అందరూ టెహ్రాన్‌ను ఖాళీ చేయాలి' అంటూ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో పోస్టు చేశారు. ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ అంతం చేస్తేనే ఇరు దేశాల మధ్య యుద్ధం త్వరంగా ముగింపు పడుతుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో యుద్ధం మరింత పెరిగే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. కాగా, ట్రంప్ తన కెనడా పర్యటనను ముందుగానే ముంగించుకుని అమెరికాకు బయల్దేరారు. అంతకుముందు ఇజ్రాయెల్‌తో ప్రస్తుతం జరుగుతున్న ఘర్షణల్లో ఇరాన్ గెలవలేదని, సమయం మించిపోక ముందే ఆ రెండు దేశాలు చర్చలు చేపట్టాలని ట్రంప్ సూచించిన విషయం తెలిసిందే. కెనడాలో జరుగుతున్న జీ7 సదస్సులో ట్రంప్ ఈ సూచన చేశారు. అమెరికా ఆస్తులపై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టకూడదని కూడా ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ తమ ఆస్తులపై ఏ రూపంలోనూ దాడులు చేయడానికి వీల్లేదని, ఒకవేళ అదే జరిగితే గతంలో ఎన్నడూ చూడని రీతిలో అమెరికా సాయుధ దళాలు ఇరాన్‌పై విరుచుకుపడతాయని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇజ్రాయెల్‌పై ఇరాన్ 100కుపైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీంతో 8 మంది ఇజ్రాయెలీ పౌరులు మరణించారు. ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల్లో ఒకటి టెల్ అవీవ్‌లోని అమెరికా ఎంబసీని తాకింది. దీంతో కార్యాలయం స్వల్పంగా దెబ్బతిన్నది. మరోవైపు, తమ లక్ష్యాలు ఇంకా పూర్తి కానందున ఇరాన్‌లోని ఆయుధాగారాల సమీపంలోని ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలిపోవాలని ఇజ్రాయెల్ తాజాగా హెచ్చరించింది.

## ఢిల్లీలో కుండపోత వర్షం..
## నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు..



**ఢిల్లీ**
దేశ రాజధాని ఢిల్లీ లో కుంభవృష్టి కురిసింది. నగరంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై భారీగా వరదనీరు నిలువడంతో చెరువులను తలపిస్తున్నాయి. దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిపాల్‌పూర్ ఏరియాలోని ఓ కూడలిలో వరదనీరు నిలువడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.మహదేవ్ రోడ్, వీడీ మార్గ్, నోయిడా సెక్టార్ 11 తదితర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం కుంభవృష్టి పడింది. మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టాయి. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆ వెంటనే భారీగా వర్షం మొదలైంది. మహిపాల్‌పూర్ ఏరియాలో రోడ్లపై వరదనీరు నిలువడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయిన దృశ్యాలను చూడవచ్చు.

## నిలకడగా సోనియా గాంధీ ఆరోగ్యం..



**న్యూఢిల్లీ**
కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆరోగ్యం నిలకడగా ఉందని సర్ గంగా రామ్ ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆదివారం రాత్రి ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. ఇవాళ సోనియా ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి చైర్మన్ అజయ్ స్వరూప్ మాట్లాడారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్సకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఉదర సంబంధిత సమస్య నుంచి ఆమె పూర్తిగా కోలుకుంటున్నారని తెలిపారు. ఆమె డైట్‌ను పూర్తిగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.సోనియా గాంధీ డిశ్చార్జి తేదీని ఇంకా నిర్ణయించలేదన్నారు. డాక్టర్ ఎస్ నండే, డాక్టర్ అమితాబ్ యాదవ్ సోనియా ఆరోగ్య పరిస్థితితో పాటు డైట్‌ను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. జూన్ 9వ తేదీన మెడికల్ చెకప్ నిమిత్తం సోనియా ఆస్పత్రికి వెళ్లిన విషయం విదితమే.

## యూఎస్‌లో పాక్ ఆర్మీ చీఫ్‌కు అవమానం



**-హైదరాబాద్**
అమెరికా పర్యటనలో పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు చేదు అనుభవం ఎదురైంది. వాషింగ్టన్‌లో మునీర్ ఉంటున్న హోటల్ ముందు పెద్ద ఎత్తున జనాలు గుమిగూడి, అతడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యానికి ఆసిమ్ మునీర్ అడ్డుగా ఉన్నాడని ఆరోపించారు. హోటల్ భవనం నుంచి పాక్ ఆర్మీ చీఫ్ బయటకు వెళ్తుండగా ప్రజలు "ఆసిమ్ మనీర్ ..సామూహిక హంతకుడివి, నువ్వు నియంత" అంటూ నినాదాలు చేశారు. ఇప్పుడు దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అమెరికాతో సైనిక, వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో ఐదు రోజుల అధికారిక పర్యటన కోసం మునీర్ ఆదివారం వాషింగ్టన్ వెళ్లినట్లు ఆ దేశ మీడియా చెబుతోంది.

## ముగ్గురిని హతమార్చిన మావోయిస్టులు

### ఏడుగురిని కిడ్నాప్ చేసినట్లు సమాచారం

**కొత్తగూడెం ప్రగతి మైదాన్**
ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న మావోయిస్టులు.. లొంగిపోయిన వారి కుటుంబాలకు చెందిన ముగ్గురిని హతమార్చారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లా పెద్దకొర్మ గ్రామానికి చెందిన జింగు మొడియం, సోమ మొడియం, అనిల్ మడివి అనే ముగ్గురు గ్రామస్తులను మావోయిస్టులు ప్రజా కోర్టు నిర్వహించి ఉరి వేసి హత్య చేసినట్లు తెలుస్తోంది.హత్యకు గురైన వారిలో ఇటీవల లొంగిపోయిన మావోయిస్టులు దినేశ్ మొడియం బంధువులుగా గ్రామస్తులు పేర్కొంటున్నారు. అంతేకాక మరో ఏడుగురు గ్రామస్తులను మావోయిస్టులు అపహరించి తీసుకెళ్లినట్లు సమాచారం.

## ఇండియా కూటమి చెక్కుచెదరదు..

### పోయేవాళ్లు పోవచ్చు : అఖిలేష్ యాదవ్



**ఉత్తరప్రదేశ్**
ప్రతిపక్ష ఇండియా కూటమి పని అయిపోయిందని, ఆ కూటమిలోని పార్టీల మధ్య సఖ్యత లేదని జరుగుతున్న ప్రచారంపై ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి , సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ స్పందించారు. ఇండియా కూటమి చెక్కుచెదరదని, బలంగా ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు.'ఇండియా కూటమి బలంగా ఉంది. అది చెక్కుచెదరదు. ఎవరైనా కూటమి నుంచి వెళ్లిపోవాలనుకుంటే స్వేచ్ఛగా వెళ్లిపోవచ్చు. ఎవరూ ఆపరు. అంతేగానీ కూటమిలో ఉంటూ కూటమిని పలుచన చేసే వ్యాఖ్యలు చేయొద్దు' అని అఖిలేష్ మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో 2027లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి సత్తాచాటుతుందని అన్నారు. మంగళవారం మధ్యాహ్నం లక్నోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ తీరుపై ఆయన విమర్శలు గుప్పించారు. మహాకుంభమేళా మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించనున్నట్లు ప్రభుత్వం చెబుతోందని, అందుకు సంబంధించిన పేర్లను ఎందుకు వెల్లడించడంలేదని ప్రశ్నించారు.

## బీచ్‌లో లవర్‌ను కట్టేసి..
## 20 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం



**భువనేశ్వర్**
ఒడిశాలోని భువనేశ్వర్ సమీపంలో 20 ఏళ్ల యువతి సామూహిక అత్యాచారానికి గురైంది. పది మంది ఆమెను రేప్ చేసినట్లు తెలుస్తోంది. గంజామ్ జిల్లాలోని గోపాల్‌పుర ఏరియా బీచ్ లో ఈ ఘటన జరిగింది. 20 ఏళ్ల యువతి స్థానికంగా ఓ ప్రైవేటు కాలేజీలో చదువుతోంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గోపాల్‌పుర్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఆ మహిళ మరో ముగ్గురు అమ్మాయిలతో కలిసి ప్రైవేటు మెస్‌లో ఉంటోంది. బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి ఆమె బీచ్‌కు వెళ్లినట్లు తెలిసింది. ఆ అబ్బాయి ఆమె క్లాస్‌మేట్. రాజా ఫెస్టివల్ సందర్భంగా బీచ్‌కు వెళ్లినట్లు అనుమానిస్తున్నారు.ఓ నిర్జన ప్రదేశంలో కూర్చున్న సమయంలో.. పది మంది తమ వద్దకు వచ్చినట్లు ఆ యువతి తన ఫిర్యాదులో పేర్కొన్నది. బాయ్‌ఫ్రెండ్‌ను బంధించి తనను రేప్ చేసినట్లు ఆమె తెలిపింది. క్రైంకు పాల్పడిన 10 మందిని అరెస్టు చేశారు. వాళ్లు విచారిస్తున్నారు. బీచ్‌కు వచ్చినవాళ్లు స్థానికులు కాదని, రాజా ఫెస్టివల్ సందర్భంగా వాళ్లు అక్కడకు వచ్చినట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. బాధితురాలు, నిందితులకు మెడికల్ టెస్ట్ నిర్వహించనున్నారు.

## విమాన ప్రమాదం ఘటనాస్థలి నుంచి 70 తులాల బంగారం, నగదు స్వాధీనం



**అహ్మదాబాద్**
అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిన విషయం తెలిసిందే. గత గురువారం అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే బీజే మెడికల్ కాలేజ్ బిల్డింగ్‌ను ఢీ కొట్టి కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ 1000 డిగ్రీల ఉష్ణోగ్రతతో మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున పొగ కమ్ముకుంది. అయితే, విమాన ప్రమాద ప్రాంతంలో ప్రయాణికుల లగేజ్, విమాన శిథిలాలు చెల్లా చెదురుగా పడ్డాయి. ఇక ప్రమాదం అనంతరం ఘటనాస్థలి వద్ద పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదును అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. 56 ఏళ్ల రాజూ పటేల్ అనే వ్యాపారి తన బృందంతో అక్కడికి చేరుకొని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ముందు 20 నిమిషాల పాటూ మంటల కారణంగా అక్కడికి చేరుకోలేకపోయారు. ఆ తర్వాత కొద్దిసేపటికే చీరలు, బెడ్ షీట్లతో గాయపడిన వారిని తరలించినట్లు రాజూ పటేల్ తెలిపారు. ఈ క్రమంలో అక్కడ 70 తులాల బంగారు ఆభరణాలు (దాదాపు 800 గ్రాములు), రూ.80 వేల నగదు, భగవద్గీత, పాస్‌పోర్ట్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాటిని అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఘటనాస్థలి వద్ద స్వాధీనం చేసుకున్న వస్తువులను బంధువులకు తిరిగి అప్పగిస్తామని హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి తెలిపారు.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..
## తెలంగాణ పౌరుల కోసం హెల్ప్‌లైన్



**హైదరాబాద్**
పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, ఆయా దేశాలలో నివసిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన పౌరుల భద్రత, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. వారికి ఎలాంటి అత్యవసర సహాయం అవసరమైనా సంప్రదించేందుకు వీలుగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నలుగురు కీలక అధికారులను ప్రత్యేకంగా నియమించింది. వారి ఫోన్ నంబర్లను కూడా ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది. అత్యవసర పరిస్థితుల్లో లేదా ఏదైనా సమాచారం కోసం తెలంగాణ పౌరులు సంప్రదించాల్సిన అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి వందన, ఐఏఎస్ (పీఎస్, రెసిడెంట్ కమిషనర్): o91 9871999044, రక్షిత్ నాయక్ (లైజన్ ఆఫీసర్): o91 9643723157, జావేద్ హుస్సేన్ (లైజన్ ఆఫీసర్): o91 9910014749, సీహెచ్ చక్రవర్తి (పౌర సంబంధాల అధికారి): o91 9949351270 నెంబర్లలో సంప్రదించాలని సూచించింది.

www.prajaswecha.com
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు

(మొదటి పేజీ తరువాయి)

విచారించేందుకు సిట్ ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే 600 మంది ఫోన్ ట్యాపింగ్ బాధితుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌తో వారు ఇబ్బందులకు గురైన తీరును వివరించి.. దానిపై ప్రభాకర్‌రావు ఏం చెబుతారనే విషయాన్ని నమోదు చేయనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సాధారణ ఎన్నికల సమయంలో నవంబర్ 15న పెద్ద ఎత్తున ట్యాపింగ్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నవంబర్ 15న 600 మంది ఫోన్లను ప్రభాకర్ రావు టీమ్ ట్యాప్ చేసినట్లు గుర్తించారు. సాధారణ ఎన్నికల సమయంలో ప్రణీత అండ్ టీమ్ పెద్ద ఎత్తున ట్యాపింగ్‌కు పాల్పడినట్లు బయటపడింది. ఒకే రోజు 600 ఫోన్‌లను ప్రభాకర్ రావు ట్యాప్ చేశారు. మావోయిస్టుల పేరు చెప్పి ట్యాపింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మావోయిస్టులకు సహకారం అందిస్తున్నారని మావోయిస్టుల సానుభూతిపరుల పేర్లతో ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. రివ్యూ కమిటీకి మావోయిస్టుల పేర్ల మీద నెంబర్లను ప్రభాకర్ రావు ఇచ్చినట్లు తేలింది. సాధారణ ఎన్నికల్లో మావోయిస్టులు యాక్టివ్ అయ్యారని కమిటీకి ప్రభాకర్ రావు చెప్పినట్లు సమాచారం. మావోయిస్టుల పేరుతో అధికార, ప్రతిపక్ష, వ్యాపార రంగానికి చెందిన వారితో పాటు జర్నలిస్టుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. ప్రతిపక్ష కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు కీలక నాయకుల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి. రేవంత్ రెడ్డి, ఈటెల రాజేందర్, అరవింద్ , రఘునందన్ రావు ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు గుర్తించారు. అప్పటి బీఆర్ఎస్ అధికారపక్ష నాయకులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారు. ట్యాపింగ్ కోసం ప్రభాకర్ రావు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. శ్రవణ్ రావు ద్వారా సమాచారం తెప్పించుకొని ప్రణీతరావుకు ప్రభాకర్ రావు ఇచ్చేవారని తేలింది. ట్యాపింగ్ ద్వారా వచ్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు భుజంగరావుకు ప్రణీత్ ఇచ్చారని... భుజంగరావు నేరుగా బీఆర్ఎస్ నేతలకు ఫోన్ చేసి స్థితిగతులను ఎప్పటికప్పుడు వివరించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రతిపక్ష నాయకుల వైపు ఎవరైనా వెళ్తుంటే వెంటనే అధికారపక్ష నేతలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు భుజంగరావు. ప్రతిపక్ష పార్టీలకు ఆర్థిక సాయం చేస్తున్న వారిపై నిఘా పెట్టి పోలీసులతో దాడులు చేయించారు. వ్యాపారవేత్తలపై దాడుల కోసం టాస్క్ ఫోర్స్ ఓఎస్‌డీ రాధా కిషన్ రావును ప్రభాకర్ రావు ఉపయోగించుకున్నట్లు సమాచారం. డబ్బులు ఎవరైనా తీసుకువెళ్తుంటే వెంటనే ట్యాప్ చేసి మరీ అధికారులు పట్టుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

# రాష్ట్ర అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్న బీఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

స్థితిగతుల్లో మార్పు జరగలేదు అన్నారు. ఇది గమనించిన తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్నికి అధికారంలోకి తీసుకొచ్చారని వెల్లడించారు. భూపాలపల్లి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శ్రీధర్ బాబుతో కలసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో రైతులు వాడిన విద్యుత్ కు పెద్ద ఎత్తున బకాయిలు పెట్టిన వాటిని కూడా ఈ ప్రభుత్వం చెల్లించి.. ఉచిత కరెంటు ఇస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రైతు భరోసా డబ్బులు పడుతున్నాయి.. 9 రోజుల్లోనే రాష్ట్రంలో ఉన్న అర్హులైన రైతులందరికీ రైతు భరోసా డబ్బులు పడతాయని తేల్చి చెప్పారు. ఏడాదికి 70 వేల కోట్ల రూపాయలను రైతుల కోసం ఖర్చుపెట్టింది ఒక్క తెలంగాణ ప్రభుత్వమే.. ఐదేళ్లలో మూడు లక్షల 50 వేల కోట్లు రైతుల కోసం ఖర్చు చెప్పబోతున్నాం.. ఇంత పెద్ద మొత్తంలో రైతుల కోసం ఖర్చుపెట్టిన ప్రభుత్వం దేశంలో ఏక్కడ లేదు.. రూ. 500 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నాం.. రాష్ట్రంలో పారిశ్రామికంగా, సంక్షేమ పరంగా, వ్యవసాయ లాంటి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. రూ. 38 వేల కోట్ల నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష కోట్లకు పెంచి.. అందిన కాడికి దోచుకున్నారు.. ఆ ప్రాజెక్టు ఇప్పుడు పనికి రాకుండా పోయింది అని భట్టి పేర్కొన్నారు. సమస్యలు ఉన్నవారు రాజధాని వరకు రాలేరని, ప్రజల సమస్యలను స్థానికంగా పరిష్కరించే వాళ్లు ఉండటం గొప్ప విషయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు ఉండదని గత పాలకులు దుష్ప్రచారం చేశారు. ఈ ఏడాది మార్చిలో గరిష్ఠంగా 17,162 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. ఎంత డిమాండ్ ఉన్నప్పటికీ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేశాం అన్నారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు. 29 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. సాగుకు ఉచిత విద్యుత్ కోసం రూ. 11,500 కోట్లు కేటాయించాం. పేదల ఇళ్లకు గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. గృహజ్యోతి, ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ కోసం ఏటా రూ. 13వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నాం. 1 కోటి 49లక్షల 35వేల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా వేస్తున్నాం'అని భట్టి తెలిపారు. భూపాలపల్లిలో పలు అభివృద్ధి కార్యాక్రమాల్లో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. జిల్లాలోని గోరికొత్త పల్లి మండలం చెన్నాపూర్ లో కోటి 40 లక్షలతో సబ్ స్టేషన్ ప్రారంభం చేసుకున్నామన్నారు. విద్యుత్ కు అంతరాయం కలగకుండా రూ. 8 కోట్ల వ్యయంతో 33/11 కేవీతో మంజూరు నగర్, ధర్మారావు పేట, నవాబుపేటలలో విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని వెల్లడించారు. అలాగే, దీర్ఘకాలికంగా సమస్య లేకుండా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంట్ ఉండదన్నారు, అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంతరాయం కలగకుండా 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.. 6 హామీలలో భాగంగా రాష్ట్రంలో 50 లక్షల మందికి 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని తేల్చి చెప్పారు. జిల్లాలో 47 వేల కుటుంబాలకు 200 యూనిట్ల విద్యుత్ ఇస్తున్నాం.. 46 వేల వ్యవసాయ కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లకు ఉచిత కరెంటు ఇస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇక, సౌర శక్తి ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మహిళా సంఘాలకు ఇవ్వడానికి సీఎం, డిప్యూటీ సీఎంతో కలిసి ప్రణాళికలు రచిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పాఠశాలకు ఉచిత కరెంట్ ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నాం.. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బంది ఉన్నప్పటికీ, 7 లక్షల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమ పథంలో తీసుకెళ్తున్నామన్నారు. బీఆర్ఎస్ వాళ్ళు ఉచిత బస్ ప్రయాణం ఎందుకు ఇస్తున్నారు అని విమర్శిస్తున్నారు.. ఎందుకు ఇస్తున్నామో మహిళలను అడగండి అని సూచించారు. ఇక, గోదావరి నదీ జలాల కొరకు మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం ప్రాజెక్టులను నిర్మించామని గొప్పలు చెప్పే వాళ్ళు ఈ ప్రాంతానికి ఒక చుక్క నీరు ఇవ్వకుండా తరలించుకెళ్లారని మండిపడ్డారు. గోదావరి నది జలాలకు సంబంధించి ఎగువన ఉన్న మహారాష్ట్ర, దిగువన ఉన్న ఆంధ్ర వాళ్ళు తెలంగాణ రాష్ట్రానికి నీరు ఇచ్చిన తర్వాతే మీరు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ట్రిబ్యునల్ ముందు మా రాష్ట్రానికి నీరు ఇచ్చిన తర్వాతే పక్క రాష్ట్రాలకు నీటిని తరలించాలని అప్పుడే చెప్పామని శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. అలాగే, మా ప్రభుత్వం వచ్చిన తర్వాత సన్న బియ్యం ఇస్తామని చెప్పాం.. ఇస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం.. కొంచం సమయం పట్టొచ్చు కానీ చేసి చూపిస్తాం.. ఇక, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతాం.. అభివృద్ధి చేసి చూపిస్తామని వెల్లడించారు. కొత్త జిల్లాలో కొత్త మండలాలకు విద్యుత్ ఏఈ కార్యాలయాలు మంజూరు చేశారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి నా కృతజ్ఞతలు.. దీంతో పాటు ఇల్లు లేని నిరుపేదలకే ఇవ్వాలని కలెక్టర్ లకు చెప్పాం.. ఇందిరమ్మ ఇండ్లు ఎక్కువగా అవసరం ఉన్న కూడా కలెక్టర్ చూసి కేటాయిస్తుంది.. వచ్చే విడతలో తప్పకుండా ఇల్లు లేని పేదల అందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామని దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చెప్పారు.

## వందలాది కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్ ట్యాపింగే కారణమన్నారు. ఎలాంటి అధికార హోదా లేని వ్యక్తికి అధికారాన్ని కట్టబట్టి తమ ఫోన్‌లను టాప్ చేయించారని ఆరోపించారు. నక్సలైట్ల సానుభూతిపరుల పేరుతో తమ ఫోన్లు టాప్ జరిగాయన్నారు. ఈనాడు కేటీఆర్ తాము నీతివంతులం, నిజాయితీపరుమలని అంటున్నారని.. ఆయన సిగ్గుతో తలవంచుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ దుర్మార్గపు చర్య అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వందలాది మంది నాయకుల ఫోన్లను చట్టానికి వ్యతిరేకంగా ట్యాప్ చేశారని మండిపడ్డారు. రాజకీయ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఆనాటి సీఎం, కేటీఆర్‌లు సిగ్గుతో తలవంచుకోవాలని వ్యాఖ్యలు చేశారు. ఏ రాజకీయ నేత, పార్టీ ఉండకూడదని.. తామే శాశ్వతంగా అధికారంలో ఉండాలనే దుర్బుద్ధితో ఫోన్ ట్యాపింగ్‌కు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ మూమెంట్స్ అన్ని కూడా ట్రాక్ చేశారని మండిపడ్డారు. 2022 నుంచి కాంగ్రెస్ నాయకుల ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నారు. 650 మంది కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిందని తెలిపారు. మ ఫోన్లను ట్యాప్ చేసి రాజకీయ లబ్ది పొందాలని చూశారని ఆరోపించారు. నిజాయితీ గల సిట్ అధికారులు ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో మరే ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే ఈ కేసులో నిందితులకు శిక్ష పడాల్సిందే అని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవ్వరినీ ఉపేక్షించవద్దన్నారు. విచారణను సజావుగా జరిపి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారికి శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వానికి వినతి చేశారు. దేశ చరిత్రలో ఇంత మంది ఫోన్లు ట్యాప్ చేయడం ఇదే ప్రథమమన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టు ఈ కేసును తీవ్రంగా పరిగణించి నిందితులను శిక్షించాలని కోరారు. ఆనాటి నేతలు వారి అవసరాల కోసం రాజకీయ నాయకులు, జడ్జిలు, విలేకర్లలతో పాటు వారి హయాంలో పని చేసిన అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారి అవసరాలకు అనుగుణంగా ఫోన్ ట్యాపింగ్‌ను వాడుకుందని ఆరోపించారు. 2023 ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి హార్డ్ డిస్క్‌లను ప్రభాకర్ రావు ధ్వంసం చేయించారన్నారు. ప్రభాకర్ రావు, అప్పటి చీఫ్ సెక్రటరీ కలిసి హార్డ్ డిస్క్‌లు ధ్వంసం చేశారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని భారాస నేత దాసోజు శ్రావణ్ విమర్శించారు. అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు.. దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణ మూర్తి అన్నారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. 'మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం'అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే.. ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోయిస్టులు చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావోయిస్టులను చంపడం తాత్కాలిక ఉపశమనమేనని శాశ్వత పరిష్కారం కాదన్నారు. శాంతిచర్చలు జరిపితే పరిష్కారం దొరుకుతుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి లోబడి ఉందన్నారు. అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా .. నక్సలైట్ రహిత దేశంగా చేస్తామంటున్నారని నటుడు ఆర్ నారాయణ మూర్తి ఫైర్ అయ్యారు పాకిస్తాన్ తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు.

## గోదావరి-బనకచర్ల పై కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

హాజరవుతారని, రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను గౌరవ అతిథులుగా ఆహ్వానించినట్లు చెప్పారు. కాంగ్రెస్‌తోపాటు భాజపా, భారాస, మజ్లిస్ పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు లేఖలు రాయడంతోపాటు స్వయంగా ఫోన్ చేసిన ఆహ్వానించామని తెలిపారు. 'ట్రైబ్యునల్, చట్టాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరి- బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వానికి అభ్యంతరాలు తెలిపాం. సీఎం రేవంత్‌రెడ్డి, నేను లేఖలు రాశాం. జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా కలిశాం. ఏపీ ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజల నీటి హక్కులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం కేంద్ర జల సంఘం వద్ద ఉన్న గోదావరి-బనకచర్ల ప్రీఫీజిబిలిటీ నివేదికను తిరస్కరించాలని కోరాం. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని తదుపరి కార్యాచరణ తీసుకోవడానికి గురువారం ఎంపీలతో సమావేశమై అందరి అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించాం'అని ఉత్తమ్ తెలిపారు.

## 42శాతం బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కామారెడ్డి డిక్లరేషన్ రాజ్యాంగ బద్ధంగా 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇది రాజకీయ వేదిక కాదు.. మానవ హక్కుల వేదిక అని చెప్పారు. విద్యకు, ఉద్యోగాలకు, రాజకీయాలకు వేర్వేరుగా రేవంత్ ప్రభుత్వం రిజర్వేషన్ బిల్లులు పెట్టాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఢిల్లీకి బీసీ రిజర్వేషన్ బిల్లు పంపామని తమకు ఏం సంబంధం లేదనేలా కాంగ్రెస్ నేతలు అనడం సరికాదని చెప్పారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఒక్కరోజైనా బీసీ బిల్లు గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడారా అని ప్రశ్నించారు. బీసీ బిల్లు వస్తే ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు, నిధులు వస్తాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో చిత్తశుద్ధి లేదని తెలిపారు ఎమ్మెల్సీ కవిత. బీసీ బిల్లు సాధనకు కేంద్రప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. బీసీ బిల్లు ఆమోదం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావడానికి జులై 17వ తేదీన రైల్‌రోకో చేపడతామని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల అంశం తేలకుండా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు పెడతామనడం సరికాదని అన్నారు. బీసీలకు రిజర్వేషన్‌లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే ఆపుతామని చెప్పారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడితే బీసీ బిడ్డల కాళ్ల వద్దకు పదవులు వస్తాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఇదిలావుంటే కవిత పర్యటనకు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యే సునీతా మహేందర్ రెడ్డిలు దూరంగా ఉన్నారు.

## యోగాతో ప్రపంచ ఐక్యతా స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించుకోబోతున్నాం. గత పదేళ్లుగా యోగా కేవలం భారతదేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ చేరువై వారి జీవితాల్లో సానుకూల ప్రభావం చూపుతోంది. అది మనందరికీ గర్వకారణం. ఈ ఏడాది విశాఖపట్నం కేంద్రంగా జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా.. ఒక భూమి.. ఒక ఆరోగ్యం..' అనే థీమ్‌తో జరుపుకోబోతున్నాం' అని ప్రధాని పేర్కొన్నారు.

## భాషల ఆధారంగా దేశాన్ని విభజించలేం

(మొదటి పేజీ తరువాయి)

భాషా వివాదం నుంచి బయటపడాలని ఆయన ప్రజల్ని కోరారు. జాతీయ విద్యా విధానం 2020ని కచ్చితంగా అమలు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ విధానం విద్యా వ్యవస్థలో గేమ్‌ఛేంజర్‌గా మారుతుందన్నారు. పాండిచ్చేరి వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కొందరు భాషలను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. గత దశాబ్దంలో అద్భుతమైన ప్రగతి జరిగిందని, దీని వల్ల భారత్ ఆకాంక్షల దేశంగా మారిందని ఆయన అన్నారు. భాషల ఆధారంగా ఎలా విభజిస్తారని ఆయన ప్రశ్నించారు. భాషల అంశంలో ఏ దేశం కూడా భారత్ అంత సంపన్నంగా లేవన్నారు. సంస్కృత భాషకు విశ్వవ్యాప్తంగా ప్రాముఖ్యత ఉందని, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, ఒడియా, మరాఠీ, పాలీ, ప్రాకృతి, బెంగాలీ, అస్సామీతో పాటు 11 క్లాసికల్ బాషలు ఉన్నట్లు చెప్పారు. పార్లమెంట్‌లో 22 భాషల్లో చర్చలు చేపట్టేందుకు సభ్యులకు అవకాశం ఉందన్నారు. మన భాషలు సమగ్రతకు నిదర్శనమని, ఐకమత్యం కోసం సనాతనం అదే బోధిస్తుందని ధన్‌ఖర్ తెలిపారు. ఆత్మ పరిశోధన చేసుకోవాలని, దానికి తగినట్లు వృద్ధి కావాలన్నారు. మన లక్ష్యాలను తెలుసుకుని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, భాషా వివాదం నుంచి బయటపడాలని అన్నారు. ఎన్‌ఈపీ పాలసీని అమలు చేయాలని రాష్ట్రాలను కోరారు. మన అబ్బాయిలు, అమ్మాయిలు ఆ లబ్ధిని పొందాలన్నారు. రాజకీయ నాయకులు ఎన్‌ఈసీ పాలసీకి భంగం కలిగించవద్దు అన్నారు.

## జి7 సదస్సును విడిన ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

ఆ నగరవాసులు నివాసాలు ఖాళీ చేసి వెళ్లిపోవాలని ట్రంప్ స్వయంగా హెచ్చరికలు జారీ చేయడం దీనికి ఆజ్యం పోసినట్లైంది. ట్రంప్ హడావుడిగా సిట్యుయేషన్ రూమ్‌ను సిద్ధం చేయించి.. వాషింగ్టన్‌కు తిరిగిరావడంతో.. అమెరికా కూడా ఇరాన్ అణుకేంద్రాలను ధ్వంసం చేయడంలో ఇజ్రాయెల్‌తో చేతులు కలపనుందనే ప్రచారం జోరందుకుంది. ఇందుకోసం దాదాపు 20 అడుగుల పొడవుండే జీబీయూ-57 అనే భారీ బంకర్ బస్టర్ బాంబును వాడాల్సి ఉంటుంది. ఇది సుమారు 13,600 కిలోల బరువు ఉంటుంది. దీనిని కేవలం అమెరికాకు తురుపు ముక్క అయిన బి-2 స్పిరిట్ బాంబర్లు మాత్రమే ప్రయోగించగలవు. కొన్ని నెలల క్రితమే ఈ రకానికి చెందిన దాదాపు 5 యుద్ధ విమానాలను పశ్చిమాసియా సమీపంలోని డియాగో గార్సియా బేస్‌కు చేర్చింది. దీనికితోడు రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, ఇతర యుద్ధ విమానాలు, ఆయుధాలను అమెరికా పశ్చిమాసియాకు తరలిస్తోంది. అమెరికా విమాన వాహక నౌక యూఎస్‌ఎస్ నిమిట్జ్ కూడా ఇప్పటికే ఈ దిశగా బయల్దేరింది. ఓ పోర్టు విజిట్‌ను కూడా రద్దు చేసుకొని ఇది పశ్చిమాసియాకు ప్రయాణం కట్టడం గమనార్హం. దీంతోపాటు డెస్ట్రాయర్లు ఇతర సహాయక నౌకలు కూడా వస్తున్నాయి. బ్రిటన్ కూడా తన ÷టైర్‌జెట్లను మోహరిస్తోంది. అమెరికా కూడా ఇజ్రాయెల్‌తో కలిసి యుద్ధం చేస్తుందన్న ప్రచారంపై ప్రముఖ వ్యాఖ్యాత టకర్ కార్ల్‌సన్ ట్రంప్‌ను విమర్శించారు.

## సంపాదకీయం

# అప్పులు...కేసులు... దబాయింపులు !

ఉమ్మడి ఎపి రాష్ట్రన్ని విడదీసిన తరవాత రెండు తెలుగు రాష్ట్రాల ఏర్పాటు లక్ష్యం నెరవేరిందా అంటే లేదనే చెప్పాలి. ఉమ్మడి ఎపికన్నా దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రం ఏర్పడ్డదే తమ అధికారం కోసం అన్నరీతిలో తెలంగాణలో దాదాపు పదేళ్ల పాటు టిఆర్ఎస్ లేదా బిఆర్ఎస్ రాజ్యమేలింది. ఐదేళ్లపాటు జగన్ కూడా ఎపిని సర్వనాశనం చేసి, అన్నింటా అవినీతిని జొప్పించారు. ఇలా దోపిడీ రాజ్యం నడిచింది. తెలుగు రాష్ట్రాల్లో దోపిడీని ప్రజలు పట్టించుకోకుండా పందేరాలకోసం పడిగాపులు కాస్తున్నారు. ఇక తెలంగాణలో అయితే ధనిక రాష్ట్రమంటూ అప్పులకుప్పను చేసింది. పథకాల పేరుతో డబ్బులు పందేరం చేసింది. కాళేశ్వరం పేరుతో లక్షకోట్లు గోదాట్లో పోసారు. ఇది పనికిరాని ప్రాజెక్ట్ అంటూ తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా వ్యాఖ్యానించారు. ఇది వయబుల్ కాదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి ఉపయోగం కన్నా నష్టం ఎక్కువగా కలిగించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. దీనిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఈ మేరకు నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ఫీజిబిలిటీ లేనిదిగా బీజేపీ గతంలోనే చెప్పిందని, ఇప్పుడు కూడా సీబీఐ విచారణ కోరుతున్నామని తెలిపారు. గత బిఆర్ఎస్ పదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, గొర్రెల పంపెంకం,చేపల పెంకం, రైతుబంధు, ఈ కార్ రేసు వంటివన్నీ అవినీతికి ఆలవాలంగా ఉన్నాయి. ఇందులో పెట్టిన డబ్బులన్నీ స్వార్థానికి వాడుకున్నారు. కోట్లల్లో అవినీతి జరిగింది. దీనిపై విచారణ కూడా సీరియస్‌గా సాగడం లేదు. ఏడాదిన్నరయినా ఫోన్ ట్యాపింగ్ సహా ఏ కూసూ తేలడం లేదు. ఇవన్నీ మరచిపోయి కెటిఆర్ సవాళ్లు విసురుతున్నారు. హరీష్ రావు విమర్శలు చేస్తున్నారు. కవిత ఒంటికాలు మీద లేస్తున్నారు. మా నాయనకు నోటీసులు ఇస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము తప్ప ఇతరులు పాలనకు పనికిరారన్న రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారు. నిజానికి కేసులు పెడితే ధైర్యంగా ఎదుర్కోవాలి. నిజాయితీ నిరూపించుకోవాలి. కానీ నిగగ్గదీస్తున్నారు. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారానికి సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సవాళ్లు విసురుతూ చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారు. దమ్ముంటే లై డిటెక్టర్ పరీక్షలకు రావాలని సవాల్ చేస్తున్నారు. సిఎం రేవంత్‌ను లై డిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ చేయడం ఆయన అసహనాన్ని తెలియచేస్తోంది. కుంభకోణం లేదు..లంబకోసం లేదు..లొట్టపీసు కేసు అంటూ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు. పదేళ్లపాటు దర్జాగా పాలన సాగించి, దగా చేసిన నేతలు ఇవాళ సవాళ్లు విసరుతున్నారు. సవాళ్లు విసిరితే ఇక చట్టాలు ఎందుకు..? కోర్టులు ఎందుకో చెప్పాలి. ఫార్ములా కార్ రేసులో తప్పు చేయలేదని అంటున్నారు. తప్పు చేయకపోతే...నేరుగా 55 కోట్లు ఎందుకు తరలించారన్నదానికి సమాధానం చెప్పాలి. నీ ఇష్టం వచ్చినట్లుగా డబ్బులు విడుదల చేసే అధికారం ఎవరిచ్చారన్నది చెప్పాలి. విచారణకు హాజరు కావడానికి మందీ మార్బలాన్ని వెనకేసుకుని రావడం ఎక్కడి ప్రజాస్వామ్యమో చెప్పాలి. కెటిఆర్ విచారణకు వెళుతున్నారా లేక ..ఏదైనా విజయయాత్రకు వెళుతున్నారా చెప్పాలి. చేసిన తప్పులకు ప్రజాకోర్టులో ప్రజలు ఇప్పటికే శిక్షించారు. కెటిఆర్ విచారణకు వస్తుంటే దాదాపు 200 మంది పోలీసులు అక్కడ మోహరించాల్సి వచ్చింది. అటు, ఈడీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగి తోపులాట చోటు చేసుకుంది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఫార్ములా ఈ రేస్‌లో వ్యవహారానికి సంబంధించి ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిదుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసింది. ఇదే కేసులో ఇప్పటికే అప్పటి పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఈడీ విచారించింది. కాగా.. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించగా.. ఈ నిర్ణయాన్ని ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇంత జరిగినా కెటిఆర్‌కు తాను చేసిన తప్పేంటో తెలియడం లేదని అనుకుంటే ఎలా. తప్పు చేయలేదని నటించినంత మాత్రాన తప్పులు ఒప్పులు కావు. హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. విదేశీ సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నారు. ఇది కళ్లకు కనిపిస్తున్న నిజం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసులు ఘనతను తుడిచేయలేవని అంటున్నారు. 'హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ అనేది మంత్రిగా తాను తీసుకున్న నిర్ణయాల్లో మంచిదని చెబుతున్నారు. ఆనాడు రేసర్లు అంతా హైదరాబాద్ వచ్చి నగరాన్ని కీర్తించారట. హైదరాబాద్ నగర బ్రాండ్ నాకు ముఖ్యం. పారదర్శకంగా రూ.46 కోట్లు బ్యాంక్ టు బ్యాంక్ విధానంలో చెల్లించిన తర్వాత అవినీతి ఎక్కడిది..? మనీ లాండరింగ్ ఎక్కడిది..?. ఒక్క రూపాయి కూడా వృథా కాలేదు. ప్రతి పైసాకి లెక్క ఉంది. ఫార్ములా ఈ రేస్ రద్దు వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరిగింది అంటూ వితండవదం చేస్తున్నారు. ఎలాంటి అవినీతి జరగకున్నా కేసులు, కోర్టులంటూ రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని చేస్తున్న వాదన ఆయన అమాయకత్వాన్ని చాటుతోంది. ఆయన ఇన్నాళ్లూ ఎలాంటి జ్ఞానం లేకుండా మంత్రిగా వెలగబెట్టారని అర్థం అవుతోంది. జగన్ కూడా ఎపిలో కూటమి విఫలం అయ్యిందని విమర్శలు మొదలు పెట్టారు. అప్పులు చేసి ఏం చేశారో చెబితే బాగుండేది. కానీ అలాకాకుండా అధికారం కోసం ఇప్పటి నుంచే తనవంతుగా ఎదురుదాడి యత్నాలకు శ్రీకారం చుట్టారు. రాజకీయ అవినీతిని విచారించేందుకు లోక్‌పాల్ లాంటి సంస్థలే శరణ్యం. ఈ దిశగా అడుగులు పడాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది.

# గో సంరక్షణకు సమగ్ర విధానం

- రూపకల్పనకు ముగ్గురు అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు
-- తొలి దశలో నాలుగు ప్రాంతాల్లో ఆధునిక వసతులతో గోశాలలు
పశుసంవర్థక శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదరాబాద్**
రాష్ట్రంలో గో సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లోని విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ఒక కమిటీని సీఎం నియమించారు. పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కూడిన కమిటీ ఈ విషయంలో లోతైన అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో గో సంరక్షణపై సీఎం మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయ పడ్డారు. భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నారనీ, స్థలాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మరణిస్తున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులను అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సీఎం సూచించారు. ప్రముఖ దేవస్థానాల ఆధ్వర్యంలో కోడె మొక్కులు చెల్లించే వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ విశ్వ విద్యాలయం సమీపంలో విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలని సీఎం సూచించారు. భక్తులు సమర్పించే కోడెల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సీఎం సూచించారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని సీఎం తెలిపారు. గో సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడబోదని సీఎం స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను అధికారులు సీఎంకు అందజేశారు. సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మరో ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక సమస్య..

అహ్మదాబాద్ టు లండన్ ఫ్లైట్ క్యాన్సిల్





**న్యూఢిల్లీ**
ఎయిర్ ఇండియా విమానాల్లో సాంకేతిక సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత వారం అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన AI 171 విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే.తాజాగా అదే రూట్‌లో ప్రయాణించే మరో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమాన సర్వీసును అధికారులు రద్దు చేశారు. ఎయిర్ ఇండియా విమానం AI 159 మంగళవారం ఉదయం న్యూ ఢిల్లీ నుంచి అహ్మదాబాద్ చేరుకుంది. అక్కడి నుంచి అది లండన్ బయల్దేరాల్సి ఉంది. అయితే, టేకాఫ్‌కు ముందు విమానంలో సాంకేతిక సమస్య తెలెత్తింది. దీంతో అప్రమత్తమైన అధికారులు విమాన సర్వీసును చివరి నిమిషంలో రద్దు చేశారు. ఎయిర్ ఇండియా విమానాల్లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. సోమవారం హాంకాంగ్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన ఏఐ 315 విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఇవాళ ఉదయం కూడా శాన్ ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబై వస్తున్న ఏఐ180 విమానంలో టెక్నికల్ ఇష్యూలు వచ్చాయి. గుర్తించిన పైలట్ మంగళవారం తెల్లవారుజామున కోల్‌కతాలో విమానాన్ని నిలిపివేశారు. దీంతో భద్రత దృష్ట్యా ప్రయాణికులను విమానం నుంచి దించేశారు. విమానంలోని ఇంజిన్లలో ఒకటి పనిచేయడం లేదని, దీంతో విమానం ఎగరడంలో ఇబ్బందులు తలెత్తాయని అధికారులు తెలిపారు. కాగా, గత గురువారం అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే ఓ బిల్డింగ్‌పై కూలిపోయింది. ఈ దుర్ఘటనలో 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన యావత్తు దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

# పాఠశాలకు బాంబు బెదిరింపులు.. అప్రమత్తమైన పోలీసులు




**న్యూఢిల్లీ**
దేశంలో బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. పలు కార్యాలయాలకు, ముఖ్యమంత్రులకు, విమానాలకు, పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు వస్తున్నాయి. తాజాగా కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపిలో గల ఓ ప్రైవేట్ పాఠశాలకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉడిపి జిల్లాలోని విద్యోదయ పబ్లిక్ స్కూల్ కు ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న ఉడిపి పోలీసులు హుటాహుటిన పాఠశాల వద్దకు చేరుకొని తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పాఠశాల ప్రాంగణంలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈమెయిల్ ఐడీ ఆధారంగా బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు బాంబు బెదిరింపులతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# ట్రంప్ మొబైల్ వచ్చేసింది




**న్యూఢిల్లీ**
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త వ్యాపారంలో ప్రవేశించారు. సరికొత్త 5జీ వైర్లెస్ సర్వీస్‌తోపాటు 499 డాలర్లకు లభ్యమయ్యే స్మార్ట్‌ఫోన్‌ను ప్రారంభించడం ద్వారా మొబైల్ ఫోన్ల మార్కెట్‌లో అడుగు పెట్టారు. 'ట్రంప్ మొబైల్' అని పిలిచే ఈ వెంచర్‌ను న్యూయార్క్‌లోని ట్రంప్ టవర్‌లో సోమవారం అధికారికంగా ప్రకటించారు.త్వరలో 'టీ1' పేరిట నాజూకైన (స్లీక్), గోల్డ్ స్టాండర్డ్ స్మార్ట్‌ఫోన్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్టు ప్రకటించారు. అమెరికాలో అతిపెద్ద టెలికం సంస్థలైన వెరిజోన్, ఏటీఅండ్‌టీ, టీ-మొబైల్ నెట్‌వర్క్‌లలో లభ్యమయ్యే ట్రంప్ అన్‌లిమిటెడ్ 5జీ వైర్లెస్ సర్వీసును పొందాలంటే నెలకు 47.45 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.

# పల్లెల్లో స్థానిక సందడి!




ప్రజా స్వేచ్ఛ....
గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమ వుతుండటంతో గ్రామాల్లో రాజకీయ నేతల్లో హడావుడి ప్రారంభమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. స్థానిక సంస్థల పదవీకాలం ముగిసినా.. ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నిధులు నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడే పరిస్థితి నెలకొంది. దీనికితోడు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే స్థితిలో ప్రభుత్వం లేదని ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన ఇందుకు ఊతం ఇస్తోంది.

## మొదట ప్రాదేశిక ఎన్నికలు

మొదట జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాతే గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. అయితే జూలై రెండో వారంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలంటే ఈ నెల చివరిలోగా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంటుంది. లేదంటే వచ్చే నెల మొదటి వారంలో షెడ్యూల్ ఇస్తే వచ్చే నెలాఖరు లేదా ఆగస్టు మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించే వీలుంటుంది.

## ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రచారం జరగడంతోపాటు ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామ పంచాయతీల్లో బ్యాలెట్ పేపర్ల ముద్రణ ఏర్పాట్లతో పాటు బ్యాలెట్ బాక్సులను కూడా ఆంధ్రప్రదేశ్ నుంచి తెప్పించి వాటికి మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచారు. గ్రామాలు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాను తయారు చేశారు. బ్యాలెట్ పేపర్లను తెచ్చి ఎస్పీ కార్యాలయంలో భద్రపరిచారు. ఎన్నికల సంఘం ఎప్పుడు షెడ్యూల్ ప్రకటించినా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని యంత్రాంగం చెబుతోంది.

## బీసీ రిజర్వేషన్లు తేలకపోవడంతో వాయిదా..

బీసీ రిజర్వేషన్ల తేలకపోవడంతో గతంలో నిర్వహించాలనుకున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపు విషయం ఇప్పటికీ కోర్టులో ఉంది. ఆ సమస్య ఎటూ తేలలేదు. కానీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సంసిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## పెరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు

గత ఎన్నికల్లో జిల్లాలో 31 మండలాలు ఉండగా ఆ తరువాత రెండు మండలాలు (గట్టుప్పల్, గుడిపల్లి) కొత్తగా ఏర్పడ్డాయి. దీంతో రెండు జెడ్పీటీసీ స్థానాలు పెరుగనున్నాయి. దీంతో జెడ్పీటీసీ స్థానాల సంఖ్య 33కు చేరకుంది. అదే విధంగా జిల్లాలో గత ఎన్నికల సమయంలో 349 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇటీవల చేపట్టిన ఎంపీటీసీ స్థానాల పునర్విభజనలో మరో 3 పెరిగాయి. దీంతో ఎంపీటీసీల సంఖ్య 352 చేరింది. ఇక గ్రామ పంచాయతీలు గతంలో 844 ఉండగా.. కొత్తగా 24 పంచాయతీలు పెరిగాయి. దీంతో పంచాయతీలసంఖ్య 868కి చేరింది.

## జెడ్పీ చైర్మన్ మినహా మిగతా రిజర్వేషన్లు ఇక్కడే..

జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు సంబంధించి ఆయా నియోజక వర్గాల వారీగా ఉన్న జనాభా ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. వాటిని కలెక్టర్ ఆధ్వర్యంలోనే ఖరారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారు. అయితే పంపిన జాబితా ఆధారంగా రిజర్వేషన్లకు ప్రభుత్వం ఆమోదించి తిరిగి జిల్లాకు పంపుతుంది. జిల్లా పరిషత్ చైర్మన్ రిజర్వేషన్ మాత్రమే రాష్ట్ర స్థాయిలో ప్రకటిస్తారు.

ఫ నెలాఖరులో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ఫ మొదట జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
ఫ ఆ తరువాతే పంచాయతీలకు..
ఫ సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం
ఫ గ్రామాల్లో మొదలైన రాజకీయ సందడి

స్థానిక సంస్థల వివరాలు ఇలా..
జెడ్పీటీసీలు 33
ఎంపీటీసీలు 352
గ్రామ పంచాయతీలు 868
ఓటర్లు 10,78,335

సిద్ధమవుతున్న పార్టీలు జిల్లాలో రాజకీయ పార్టీలు స్థానిక ఎన్నికలకు సిద్ధం అవుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజక వర్గాలుంటే సూర్యాపేట మినహా 11 నియోజక వర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు తాము అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అంతకుముందు పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి విజయం సాధించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మరోవైపు ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి తమ పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా బీఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బీజేపీకి జిల్లాలో ఎమ్మెల్యేలు లేకపోయినా ఓటింగ్ శాతం పెరిగింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈసారి ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

# సాగర్ సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ లు



నాగార్జునసాగర్,ప్రజా స్వేచ్ఛ....
అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్ ను మంగళవారం నాడు ట్రైనీ ఐఏఎస్ ల బృందం సందర్శించింది. తెలంగాణ దర్శనంలో భాగంగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు జిల్లా శిక్షణ కార్యక్రమంలో భాగంగా నాగార్జున సాగర్ ను సందర్శించారు. దీనిలో భాగంగా నాగార్జునసాగర్ బుద్ధవనం చేరుకున్న ట్రైనీ ఐఏఎస్ అధికారులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించబడిన సౌరబ్ శర్మ, నిజామాబాద్ జిల్లాకు కేటాయించబడిన క్యారోలిన్ చింగ్ తీ అమ్మాయి లు మిర్యాలగూడ సబ్ కలెక్టర్, (లోకల్ బాడీస్ )ఇన్చార్జ్ అడిషనల్ కలెక్టర్ నారాయణ అమిత్ తో సమావేశమైనారు. అనంతరం బుద్ధ వనంలోని బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం బుద్ధ చరితవనం, జాతకవనం, ధ్యానవనం, స్థూప వనం లను సందర్శించి మహా స్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా సమావేశ మందిరంలో బుద్ధవనం డాక్యుమెంటరీని వీక్షించిన అనంతరం బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు ట్రైనీ ఐఏఎస్ లకు బుద్ధ వనం బ్రోచర్లతోపాటు, పంచశీల కండువాలను బహూకరించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్ లు మాట్లాడుతూ కృష్ణానది తీరాన నాగార్జునసాగర్ లాంటి ప్రశాంతమైన వాతావరణంలో బుద్ధవనం సందర్శన మరింత ప్రశాంతత కలగజేస్తుందని అభిప్రాయపడ్డారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం, నాగార్జునకొండ చారిత్రక విశేషాలను, నాగార్జునసాగర్ డ్యాం వివరాలను తెలియజేశారు. వీరితోపాటు తెలంగాణ దర్శన్ డిస్టిక్ ట్రైనింగ్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రోటోకాల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ దండ శ్రీనివాస్ రెడ్డి, విజయ విహార్ మేనేజర్ కిరణ్ తదితరులు ఉన్నారు.

# ఎమ్మార్వో ఆఫీస్ లో అధికారులు రాకపోవడంతో పడిగాపులు కాస్తున్న ప్రజలు



ప్రజా స్వేచ్ఛ....
ఆందోల్ నియోజకవర్గం వట్ పల్లి మండల కేంద్రంలో ఎమ్మార్వో ఆఫీస్ పట్టించుకోని అధికారులు నిర్లక్ష్యం వల్ల పడిగాపులు కాస్తున్న ప్రజలు భూ సమస్య గురించి ఆరు నెలల నుంచి తిరిగిన పట్టించుకోని అధికారులు మరియు సమయానికి ఏ ఒక్క అధికారి కూడా రాడు వట్ పల్లి మండలంలో ఎమ్మార్వో ఆఫీస్ ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదు పరిస్థితి దారుణంగా ఉంది కాబట్టి పై అధికారులకు ఈ దుస్థితి ఉన్నత అధికారులు దగ్గరికి తీసుకెళ్లగలరని ప్రజలు కొరుతున్నారు.

# బాల బాలికలను అంగన్ వాడి కేంద్రంలో చేర్పించాలి.

సిడిపిఓ శాంతి శ్రీ



మహేశ్వరం, ప్రజా స్వేచ్ఛ....
మూడు సంవత్సరాలు నిండిన బాల బాలికలను విధిగా అంగన్ వాడీ సెంటర్ లో చేర్పించాలని సిడిపిఓ శాంతి శ్రీ అన్నారు. అమ్మ మాట అంగన్ వాడి బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం రావిరాలలో పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్ వాడి కేంద్రాలలో ప్రైవేటు స్కూళ్లకు దీటుగా విద్యాభ్యాసం చేపించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. అంగన్ వాడి సెంటర్ లో బాల బాలికలకు అందిస్తున్న సేవలను ఆమె వివరించారు. సామాజిక అభివృద్ధి, భాషాభివృద్ధి, మేదో మధనం, శారీరక అభివృద్ధి, బడికి సంసిద్ధత గురించి వివరించారు. బాల బాలికలకు సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. రిపోర్టర్ వెంకటేష్ బాలబాలికలకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ విద్యావతి, వార్డ్ ఆఫీసర్ మనోహర్, టీచర్లు అనురాధ, దివ్య, శివకుమార్ పాల్గొన్నారు.


# ఎకరాలతో సంబంధం లేకుండా అందరికీ రైతు భరోసా...!!

తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది అన్నదాతలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న రైతు భరోసా పథకం కింద ఆర్థిక సహాయం రేపటి నుంచి వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది.

ఈ శుభవార్తను స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ప్రధాన హామీలలో ఒకటైన ఈ పథకం అమలుతో, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మరోసారి స్పష్టమైంది. ఎకరాలతో సంబంధం లేకుండా.. అర్హులైన రైతులందరి ఖాతాల్లో ఎకరానికి ఒక్క సీజన్‌కు రూ.6 వేల చొప్పున నిధులు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## -రైతు భరోసా.. సమగ్ర పంట పెట్టుబడి సహాయం..

రైతు భరోసా పథకం అనేది తెలంగాణ రైతన్నలకు పంట పెట్టుబడి కోసం అందించే సమగ్ర ఆర్థిక సహాయ కార్యక్రమం. గతంలో ఉన్న 'రైతు బంధు' పథకం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నూతన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద, అర్హులైన రైతులందరికీ ఏడాదికి ఎకరానికి రూ.12,000 చొప్పున ఆర్థిక సహాయం అందించబడుతుంది. ఈ మొత్తాన్ని ఖరీఫ్ (వానాకాలం) , రబీ (యాసంగి) సీజన్లకు గాను ఒక్కో విడతలో రూ.6,000 చొప్పున పంపిణీ చేస్తారు. ఈ నిధులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ కూలీ ఖర్చులు వంటి పంట పెట్టుబడి అవసరాలను తీర్చడానికి ఎంతగానో ఉపయోగ పడతాయి.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ఈ పథకం గత ప్రభుత్వ విధానాల కంటే మరింత సమ్మిళితమైనది. ఇది భూ యజమానులతో పాటు, కౌలు రైతులు మరియు భూమిలేని వ్యవసాయ కార్మికులను కూడా తన పరిధిలోకి తీసుకువస్తుంది. ధరణి పోర్టల్‌లో నమోదైన భూమి కలిగిన పట్టాదారులు, అటవీ హక్కుల గుర్తింపు పట్టాదారులు కూడా 'రైతు భరోసా'కు అర్హులు. పారదర్శకతను పెంచే లక్ష్యంతో నిధులను నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు.

## -హామీల అమలు.. ప్రభుత్వ నిబద్ధత

గత కొన్ని నెలలుగా.. రైతు భరోసా నిధుల విడుదలపై రైతన్నల్లో కొంత ఉత్కంఠ నెలకొంది. అయితే.. నూతన ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను సమీక్షించి, ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఇప్పుడు నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు నిధుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేశారు. తద్వారా వానాకాలం సాగు ప్రారంభానికి ముందే రైతన్నలకు పెట్టుబడి అందుబాటులోకి వస్తుంది.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో లభిస్తున్న ఈ ఆర్థిక చేయూత, వారిని అప్పుల ఊబి నుంచి బయటపడటంతో పాటు, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడానికి కూడా సహాయపడుతుంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 'ఆరు గ్యారెంటీలలో' రైతు భరోసా కూడా ఒకటి. ఈ గ్యారెంటీలను దశలవారీగా అమలు చేస్తూ, ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం అమలు, తక్షణ నిధుల విడుదల ద్వారా వ్యవసాయ రంగాన్ని సుస్థిరం చేయాలని, రైతుల ఆర్థిక సాధికారతను సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతుందని అంచనా

# ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన

ట్రాఫిక్ నిబంధనల పైన అవగాహన కలిగి ఉండాలి.
మందమర్రి ఎస్ఐ రాజశేఖర్



**మందమర్రి, ప్రజా స్వేచ్ఛ....**
ట్రాఫిక్ నియమాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని మందమర్రి ఎస్సై రాజశేఖర్ పేర్కొన్నారు. మందమర్రి పోలీసులు సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు నిర్వర్తించే విధులను విద్యార్థులకు వివరించడమే కాకుండా, వారితో కలిసి ట్రాఫిక్ నియంత్రణను నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, మైనర్ డ్రైవింగ్ వల్ల ఎదురయ్యే నష్టాలు కీలక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వాహనదారులను గుర్తించి, వారికి విద్యార్థుల చేత మామిడి పండ్లను అందించారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టం ముమ్మాటికి రైతులకు చుట్టమే

-ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి.








**కల్లూరు జూన్ ప్రజా స్వేచ్ఛ....**
ఖమ్మం జిల్లా, కల్లూరు మండలం, చంద్రుపట్ల గ్రామంలో జరిగిన భూభారతి చట్టం అవగాహన సదస్సు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ నీరజ ప్రభాకర్ చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూభారత్ చట్టం ముమ్మాటికి రైతుల చట్టమేనని గతంలో ఉన్న ధరణిలో లోపాలను సరిచేసి రైతులకు అనుకూలంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చారని ఇది కాంగ్రెస్ పార్టీ పేదల పాలిట రైతు పక్షపాతిగా ఉంటుందని చెప్పటానికి ఒక ఉదాహరణ అని అన్నారు, స్థానిక ఎమ్మార్వో పులి సాంబశివుడు మాట్లాడుతూ భూ భారతీ చట్టంపై సెక్షన్లు వారీగా అవగాహన కల్పించారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లారావు మాట్లాడుతూ చట్టం గతంలో ధరణి చట్టం మధ్య వ్యత్యాసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ లింగనబోయిన పుల్లారావు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాటంనేని బాబురావు, కుక్క వేలాద్రి, తూము నరసింహారావు, చప్పిడి నరసింహారావు, రాయి నాగేశ్వరరావు, పరిగడుపు వెంకటేశ్వర్లు, ఇనపనూరు ముత్తయ్య, మూకర విజయరావ్, తిప్పారెడ్డి రామనరసింహారావు గంధం చిరంజీవి, దుగ్గిరాల సీతారాములు, బర్రె భారతి రాజా, విజయదాస్, పైళ్ల నాగేశ్వరరావు, గద్దె భాస్కరరావు, వల్లపునేని అప్పారావు, గోసు కృష్ణారావు నెల్లూరు జగదీష్ పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావు మరియు సిబ్బంది గ్రామ ప్రజలు మహిళలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నూతన తహసీల్దార్‌కు ఘన సన్మానం.

**జగిత్యాల, ప్రజా స్వేచ్ఛ....**
ఇబ్రహీంపట్నం మండలానికి ఇటీవల బదిలీపై వచ్చిన నూతన తహసీల్దార్ వరప్రసాద్ ను కాంగ్రెస్ నేతలు ఘనంగా సన్మానించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఆకాంక్షిస్తూ, తహసీల్దార్‌కు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమీటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూస రాజేశ్వర్ ఉన్నారు



# రైతులకు CM రేవంత్ గుడ్ న్యూస్.. 90% సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు..!!






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**ప్రజా స్వేచ్ఛ....**
హైదరాబాద్, రైతు భరోసా పథకం కింద 9 రోజుల్లో 70,11,984 మంది రైతుల ఖాతాల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తున్నట్లు సీఎం రేవంత్రెడ్డి ప్రకటించారు. సోమవారం అగ్రికల్చర్ వర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 'రైతు నేస్తం' వేదిక నుంచి ఆయన ఆన్‌లైన్లో స్విచ్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేశారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతుల ఆశీర్వాదం లేకుండా ఎవరూ అధికారంలోకి రాలేరని, రైతు సంక్షేమమే పరిపాలనలో ముఖ్య లక్ష్యమని చెప్పారు. "రైతును రాజును చేయడమే కాదు.. వ్యవసాయాన్ని పండుగ చేస్తం. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది.. ప్రజా ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే రైతుల సంక్షేమం కోసం రూ. లక్ష కోట్లు ఖర్చు పెట్టింది. ఎన్ని కష్టాలు ఎదురవుతున్నా అన్నదాతలకు అండగా నిలుస్తున్నం' అని పేర్కొన్నారు.

**నాడు వరి వేస్తే ఉరే అన్నరు**
"వరి వేస్తే ఉరి వేసుకోవాల్సిందేనని నాడు కేసీఆర్ అన్నడు. వరి వేయండి.. చివరి గింజ వరకు కొనే బాధ్యత మాది అని చెప్పిన ప్రభుత్వం మాది. చివరి గింజ వరకూ కొంటున్నం. తెలంగాణ రాష్ట్రం వరి పండించడంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఒక్క సంవత్సరంలో 2.80 కోట్ల టన్నుల వడ్లు పండాయి' అని సీఎం రేవంత్రెడ్డి పేర్కొన్నారు.
రైతుల కండ్లలో ఆనందం చూస్తున్నామని, ముఖ్యమంత్రిగా తనకు ఇంతకంటే ఇంకేం కావాలని ఆయన అన్నారు. "పేదలకు సన్న బియ్యం ఇచ్చేందుకుగాను సన్న వడ్లు పండించేలా రైతులను ప్రోత్సహించాం. సన్న వడ్లకు రూ. 500 బోనస్ అందిస్తున్నం. సన్న వడ్ల ఉత్పత్తిలోనూ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. రైతుల శ్రమతో రైతులు సన్న వడ్లు పండించడం వల్లే ఇవాళ పేదలకు సన్నంబియ్యం అందించి పేదల కడుపు నింపుతున్నం' అని తెలిపారు.
లీడర్లు గెలవాలంటే రైతన్నల ఆశీర్వాదం తప్పనిసరిగా ఉండాల్సిందేనని.. ఇందిరమ్మ రాజ్యంలో రైతులే రాజులని అన్నారు. "రైతు ఆశీర్వాదం లేకపోతే ఎవరూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేరు. ఈ దేశంలో ఎవరు ప్రజా ప్రతినిధిగా ఎన్నిక కావాలన్నా, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నా రైతుల ఆశీర్వాదం, రైతుల చేయూత ఉండాల్సిందే. వార్డు మెంబర్ కావాలన్నా, సర్పంచ్ కావాలన్నా, ఎంపీటీసీ కావాలన్నా, జెడ్పీటీసీ కావాలన్నా, జిల్లా పరిషత్లో గెలవాలన్నా, శాసనసభలో ప్రాతినిధ్య వహించాలన్నా, పార్లమెంట్కు వెళ్లాలన్నా, ముఖ్యమంత్రి కావాలన్నా రైతులు అండగా నిలబడి ఆశీర్వదిస్తేనే సాధ్యమని బలంగా విశ్వసిస్తున్న' అని ఆయన వివరించారు.

**-ఇతర పంటలపైనా దృష్టి పెట్టాలి**
వరి పంటనే కాకుండా ఇతర లాభసాటి పంటలను పండించాలని రైతులకు సీఎం రేవంత్రెడ్డి సూచించారు. "భూమి సారాన్ని భట్టి ఏ భూమిలో ఏ పండ్ల తోటలు వస్తాయో.. ఏ భూమిలో ఏ కూరగాయలు పండుతాయో.. ఏ భూమిలో ఏ పంట అధిక దిగుబడి వస్తుందో.. పత్తి వస్తుందా, మిర్చి వస్తుందా, లేకపోతే కందులు వస్తాయా అని ఆలోచించి సాగు చేపట్టాలి. మా కొడంగల్ తాండూరు ప్రాంతంలో మేం కందులు పండిస్తం. తాండూరు కొడంగల్ కందిపప్పు అంటే గొప్ప పేరు ఉంది. అచ్చంపేట ప్రాంతంలో పోతే దోసకాయలు పండుతాయి. దోసకాయ, కందిపప్పు కూర ఎంత బ్రహ్మాండంగా ఉంటది.. చికెన్ మటన్ కూడా పనికిరాదు దాని ముందు. ఇప్పుడున్న పిల్లలకు ఆ రుచి తెలవకుంటానే పోయింది. కూరగాయలు, పండ్లు పక్క రాష్ట్రాల్లో నుంచి తెచ్చుకుంటున్నం. ఇక్కడే వాటిని పండించుకుందాం' అని సూచించారు. ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోకుండా ప్రజల కోసం రోజూ 18 గంటలు పనిచేస్తున్నామని, తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్రెడ్డి అన్నారు.

**-90% సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు**
సోలార్ పంపుసెట్లు, వాణిజ్య పంటలు, ఇతర పంటలపై రైతులకు కలెక్టర్లు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ ను సీఎం రేవంత్రెడ్డి ఆదేశించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి వ్యవసాయ పనిముట్లను 90% సబ్సిడీతో అందజేయాలని, సోలార్ విద్యుత్ ద్వారా రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. రైతులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి, భూమి సారాన్ని కాపాడుతూ లాభసాటి పంటలు పండించేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాల్లో రైతు వేదికల ద్వారా అవగాహన కల్పించేందుకు అనుభవజ్ఞులైన రైతులను గుర్తించి, వారికి రూ. 1,000 గౌరవ వేతనం ఇచ్చి ప్రోత్సహించాలని కలెక్టర్లకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.

రుణమాఫీ అయింది.. సన్నాలకు బోనస్ వస్తున్నది
రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్?లో రైతులు
వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర వ్యాప్తంగా1,034 రైతు వేదికల నుంచి రైతులు భాగస్వామ్యం అయ్యారు. ఈ సందర్భంగా సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముచ్చటించారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక తమకు రుణమాఫీ జరిగిందని, సన్నాల సాగు ద్వారా బోనస్ వచ్చిందని వివిధ ప్రాంతాల రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

**డ్రిప్ ఇవ్వండి..**
నాకు మూడెకరాలు భూమి ఉన్నది. కూరగాయలు పండిస్తా. మా ఊరు వికారాబాద్ జిల్లా చౌదరి పల్లి నుంచి రోజుకు ఆరు డీసీఎంల కూరగాయలు హైదరాబాద్కు వస్తున్నాయి. 700 ఫీట్లు బోర్ ఏస్తే నీళ్లు పడుతాయి. కూరగాయల సాగుకు మాకు డ్రిప్ ఇవ్వండి. చిన్న చిన్న పవర్ వీడర్లు కూడా ఇవ్వాలి. ఆలుగడ్డ పండిస్తే లక్ష రూపాయలు వచ్చినయి. మక్కలు పెడితే మంచి లాభం వచ్చింది. హైదరాబాద్ సిటీ చుట్టూ భూములన్ని రియల్ ఎస్టేట్ వెంచర్లు అయినవి. ఒకప్పటి లెక్క పాల క్యాన్లు, కూరగాయలు సిటీకి వస్తలేవు. సిటీ చుట్టు కూరగాయలు, పండ్ల తోటలు పెంచాలి.
– వెంకట రామయ్య, రైతు, చౌదరి పల్లి

**-లక్షా 65 వేలు మాఫీ అయింది**
మాది మహబూబాబాద్ జిల్లా జమాన్లపల్లి. నేను మిరప పంట ఎక్కువగా సాగు చేస్తుంటాను. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీతో నాకు రూ. 1.65లక్షల పంటరుణం మాఫీ అయింది.

# జగిత్యాల జిల్లా జాబితాపూర్, ఆనంతారం గ్రామ భూభారతి రెవెన్యూ సదస్సుల్లో విశేష స్పందన : రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్

-గిర్దావర్లు షేమ్ షోద్దీన్, భూమయ్య
-సర్వే నెంబర్ల మిస్సింగ్, వారసత్వం పట్టా తదితర భూ సమస్యలు

**జగిత్యాల జిల్లా ,ప్రజా స్వేచ్ఛ....**
జగిత్యాల జిల్లా జాబితాపూర్, ఆనంతారం గ్రామంలో మిస్సింగ్ సర్వే నెంబర్, వారసత్వం పట్టా, రికార్డులో తప్పులు సవరణ, తదితర భూ సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకున్న కొత్త చట్టం భూభారతి ద్వారా రైతులకు మేలు జరిగేందుకు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జగిత్యాల జిల్లా జాబితాపూర్, ఆనంతారం గ్రామములో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం రైతులకు ఎంతో ఉపయోగకరంగా తయారయింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ తహసీల్దార్ టీం లీడర్ శ్రీనివాస్, టీం లీడర్ నాయబ్ తహసీల్దార్ అరుణ్ కుమార్, గిర్దావర్ లు భూమయ్య, షేమ్ షోద్దీన్ , సీనియర్ సహాయకులు గంగారాం, జూనియర్ సహాయకులు, నిరంజన్, శ్రీనివాస్, రాజేందర్, భాస్కర్, గంగరాజం, జయ, సుజాత, సల్మాన్, రాము, రషీద్ పాల్గొన్నారు.



# బిజినెస్

## పుత్తడి ప్రియులకు గుడ్‌న్యూస్..

**ఒకేరోజు ఏకంగా ఎంత ధర తగ్గిందంటే..?**



బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఆభరణాల వ్యాపారులు, స్టాకిస్టులు అమ్మకాలతో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర ఒకే రోజు రూ.1200 తగ్గింది. తులం రూ.1,00,170కి చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల గోల్డ్ సైతం రూ.1,100 తగ్గి తులం రూ.99,450కి చేరుకుంది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. అయితే, వెండి ధర రూ.100 పెరిగి కిలోకు రూ.1,07,200కి చేరుకున్నది. ప్రపంచవ్యాప్తంగా.. స్పాట్ బంగారం ఔన్సుకు 3,380.65కి తగ్గింది. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ వెండి 0.44 శాతం పెరిగి ఔన్సుకు 36.47కి చేరుకుంది. ఇజ్రాయెల్–ఇరాన్ ఉద్రిక్తతలపై కాల్పుల విరమణకున్న అవకాశాల నేపథ్యంలో బంగారు వ్యాపారుల్లో సెంటిమెంట్‌ని పెంచిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు (కమోడిటీస్) సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతకు దౌత్యపరమైన పరిష్కారాల కోసం ఇరాన్ ప్రయత్నిస్తున్నందని పలు నివేదికలు తెలిపాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ.. బంగారం ధర తగ్గుముఖం పడుతోందని మెహతా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి తెలిపారు. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన సమావేశానికి ముందు రోజు గరిష్ట స్థాయి నుంచి వెండి ధరలు తగ్గాయని కలాంత్రి పేర్కొన్నారు. ప్రపంచ మార్కెట్‌లో అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బంగారం ధరలు పెరిగేందుకు అవకాశం ఉందన్నారు. యూఎస్ ఆర్థిక వ్యవస్థను అంచనా వేయడానికి పెట్టిబడిదారులు మే నెలలో రిటైల్ అమ్మకాలు, పారిశ్రామిక ఉత్పత్తి డేటాతో సహా యూఎస్ మైక్రో డేటాను గమనిస్తున్నారని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చింతన్ మెహతా పేర్కొన్నారు.


## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు.. 212 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్..



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. మార్కెట్‌లో ఐటీ మినహా ఇతర సూచీలు నష్టాల్లో కొనసాగాయి. ఫలితంగా మార్కెట్లు పొద్దంతా ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,869.47 స్వల్ప లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 81,890.15 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 81,427.01 పాయింట్లకు పడిపోయింది.చివరకు 212.85 పాయింట్లు పతనమై.. 81,583.30 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 93.10 పాయింట్లు దిగజారి.. 24,853.40 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,443 షేర్లు లాభపడ్డాయి. 2,384 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సన్ ఫార్మా, ఎటర్నల్, ఓఎన్‌జీసీ నష్టపోగా.. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్, మారుతి సుజుకీ లాభాల్లో కొనసాగాయి. ఐటీ మినహా, ఫార్మా, మెటల్, ఆయిల్, గ్యాస్, ఆటో, రియాలిటీ, పీఎస్‌యూ బ్యాంక్ 0.5–2 శాతం పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.5 శాతం తగ్గాయి.

## ఐఫోన్ 17 కంటే ట్రంప్ మొబైల్ చాలా చౌకగా..

**మరి ఇండియాలో ఎంత?**




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన కుటుంబం ట్రంప్ మొబైల్ తో ఫోన్ వ్యాపారంలోకి అడుగుపెడుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ కుటుంబం మరో కంపెనీ ఏర్పాటుకు సిద్ధమైంది. మొబైల్ ఫోన్ కంపెనీని ప్రారంభించనున్నట్లు ట్రంప్ కుటుంబం తెలిపింది. కంపెనీ తన మొదటి ఆఫర్‌లో భాగంగా కొత్త ' T1 ఫోన్' '47 ప్లాన్' మొబైల్ నెట్‌వర్క్ సేవను ప్రకటించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసలు అధ్యక్ష ఎన్నికల ప్రచారం ప్రారంభించిన పది సంవత్సరాల తరువాత ట్రంప్ ఆర్గనైజేషన్ తన సొంత మొబైల్ ఫోన్ నెట్‌వర్క్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది. ట్రంప్ మొబైల్ గా పిలువబడే ఇది ఆల్–అమెరికన్ సర్వీస్‌గా ప్రచారం చేయబడుతున్న నెట్‌వర్క్. అలాగే ట్రంప్ బ్రాండ్‌పై ఎక్కువగా ఆధారపడుతుంది.కొత్త మొబైల్ ఫోన్ నెట్‌వర్క్ ప్రారంభం ఖచ్చితంగా ట్రంప్ అనుచరులను ఆకర్షిస్తుంది. అయితే ఇది అమెరికా మొబైల్ మార్కెట్‌ను విస్తరించే విధంగా కాకుండా ట్రంప్ బ్రాండ్‌ను క్యాష్–ఇన్‌గా భావిస్తుంది. ట్రంప్ మొబైల్ ఒక మొబైల్ వర్చువల్ నెట్‌వర్క్ ఆపరేటర్ (MVNO). ఆపిల్‌తో పోటీ పడటానికి ట్రంప్ కంపెనీ అమెరికాలోని కస్టమర్ల కోసం ట్రంప్ మొబైల్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ ఫోన్ ప్రీ–బుకింగ్ కోసం అందుబాటులో ఉంది. కానీ ఈ ఫోన్ అమ్మకానికి కొన్ని నెలలు వేచి ఉండాల్సి ఉంటుంది. నివేదికల ప్రకారం.. ట్రంప్ మొబైల్ ధర ఐఫోన్ 17కంటే తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి.

## కోహ్లీ స్థానంలో అతడు..
# నంబర్ 5లో నాయర్..!




సచిన్ –అండర్సన్ ట్రోఫీ తొలి టెస్టు కోసం భారత బ్యాటింగ్ లైనప్ కూర్పు ఇంకా కొలిక్కి రాలేదు. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు ఏక కాలంలో వీడ్కోలు పలకడంతో టాపార్డర్‌లో ఎవరిని ఆడించాలి? అనేది కొత్త సారథి శుభ్‌మన్ గిల్(Subhman Gill) కు తలనొప్పిగా మారింది. తొలి టెస్టుకు ఇంకా మూడు రోజులే ఉన్నందున మాజీ కోచ్ రవి శాస్త్రి (Ravi Shastri) నంబర్ 3, నంబర్ 5లో ఎవరిని ఆడిస్తే జట్టుకు మంచిదో సూచించాడు.ఈ దశాబ్దంలో రోహిత్, కోహ్లీలు లేకుండా తొలిసారి భారత్ టెస్టు సిరీస్ ఆడుతోంది. దాంతో, వీళ్ల స్థానాన్ని భర్తీ చేయగల సమర్థులైన ఆటగాళ్ల వేటలో పడ్డారు కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ గిల్. ఈ నేపథ్యంలో రవి శాస్త్రి కీలక సూచలను చేశాడు. ఓపెనింగ్ జోడీగా యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్‌ను ఆడించాలని అభిప్రాయపడ్డాడు. విరాట్ రిటైర్మెంట్‌తో ఖాళీ అయిన మూడో స్థానంలో సాయి సుదర్శన్ సరైన ఎంపిక అని శాస్త్రి తెలిపాడు.అయితే.. యశస్వీ ఎంట్రీకి ముందు హిట్‌మ్యాన్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన కెప్టెన్ గిల్ 4వ స్థానంలో, ఇంగ్లండ్ లయన్స్‌పై ద్వి శతకంతో చెలరేగిన కరుణ్ నాయర్ 5వ స్థానంలో ఆడితే బెటర్ అని మాజీ క్రికెటర్ వెల్లడించాడు. పేస్ ఆల్‌రౌండర్లుగా నితీశ్ రెడ్డి, శార్దూల్ ఠాకూర్‌లు జట్టులో ఉండాలని శాస్త్రి సూచించాడు. అంతేకాదు జూన్ 20న జరుగబోయే తొలి టెస్టుకు వేదికైన లీడ్స్‌లోని హెడింగ్లేలో వాతావరణం పేసర్లకు అనుకూలిస్తుందని.. మూడో పేసర్‌గా లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణల మధ్య పోటీ తప్పదని చెప్పాడీ వెటరన్.

## వన్డే బ్యాటింగ్ ర్యాంకులు..
## టాప్ ప్లేస్ కొట్టేసిన స్మృతి మంధాన

**దుబాయ్**



భారత మహిళా క్రికెటర్ స్మృతి మందాన(Smriti Mandhana).. వన్డే బ్యాటింగ్ ర్యాంకుల్లో టాప్ ప్లేస్ కొట్టేసింది. తాజాగా రిలీజ్ చేసిన ర్యాంకుల జాబితాలో ఆమె అగ్రస్థానంలో నిలిచింది. 2019 తర్వాత భారత వైస్ కెప్టెన్ మందాన మళ్లీ ర్యాంకుల్లో ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా వోల్వార్డ్.. ఇటీవల 19 పాయింట్లు కోల్పోయింది. దీంతో స్మృతి టాప్ వన్ నెంబర్ దిశగా దూసుకెళ్లింది. 727 రేటింగ్ పాయింట్లతో స్మృతి మందానా టాప్ ప్లేస్‌లో నిలిచింది. ఇంగ్లండ్ కెప్టెన్ నటాలీ స్కీవర్ బ్రంట్ 719 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో ఉంది. వోల్వార్డ్ 719 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచింది. మందాన తర్వాత ర్యాంకు లిస్టులో ఉన్న ఇండియన్ బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ ఉన్నారు. ఆ ఇద్దరూ 14, 15వ స్థానాల్లో నిలుచున్నారు.

# స్పోర్ట్స్

## సచిన్ జోక్యంతో దిగొచ్చిన ఇంగ్లండ్.. విన్నింగ్ కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'..!



భారత క్రికెట్ జట్టు ఇంగ్లండ్ పర్యటన ఖరారైనప్పటి నుంచి పటౌడీ ట్రోఫీ గురించి చర్చ కొనసాగుతోంది. అందుకు కారణం ఈ ఏడాది నుంచి ఇరుదేశాల దిగ్గజాలు సచిన్ అండర్సన్ పేర్లతో ట్రోఫీ నిర్వహిస్తామని ఇంగ్లండ్ ప్రకటించడమే. ఈ నేపథ్యలో భారత లెజెండరీ ఆటగాళ్లు సునీల్ గవాస్కర్, బీసీసీఐ పెద్దలు పటౌడీ పేరు మార్చవద్దని ఈసీబీకి విన్నవించారు. సచిన్ టెండూల్కర్ ఐసీసీ ఛైర్మన్ జై షాలు సైతం ఆనవాయితీ ప్రకారం ఆయన పేరుతో ట్రోఫీ జరపాలని సూచించారు. ఈ ఇద్దరి విజ్ఞప్తితో దిగొచ్చిన ఇంగ్లండ్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది.'ఈ ఏడాది నుంచి భారత్, ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌ను పటౌడీ పేరుతో కాకుండా సచిన్– అండర్సన్ ట్రోఫీగా నిర్వహించాలని ఈసీబీ నిర్ణయించింది. అయితే.. అలా చేయడం దిగ్గజ ఆటగాడైన పటౌడీని అగౌరపరచడమేనంటూ పలువురు భారత క్రికెటర్లు మండిపడ్డారు. తన పేరుతో ట్రోఫీ జరపాలనుకుంటున్న ఈసీబీకి టెండూల్కర్ ప్రత్యేక విన్నపం చేశాడు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇరుదేశాల సిరీస్‌లో పటౌడీ పేరు ఉండేలా చూడాలని కోరాడు. దాంతో, సానుకూలంగా స్పందించిన ఈసీబీ.. విన్నింగ్ కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'ను కానుకగా ఇస్తామని తెలిపింది' అని మంగళవారం బీసీసీఐ ఓ ప్రకటనలో వెల్లడించింది.

**75 ఏళ్లకు గుర్తుగా..**

భారత్, ఇంగ్లండ్‌ల మధ్య తొలి టెస్టు సిరీస్‌కు 2007లో 75 ఏళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా ఇరుదేశాల బోర్డులు ఇంగ్లండ్‌లో జరుగబోయే సిరీస్‌ను మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ పేరుతో నిర్వహించాలని నిర్ణయించాయి. అప్పటినుంచి 2024 వరకూ పటౌడీ పేరుతోనే ట్రోఫీని జరిపారు. అయితే.. నిరుడు జేమ్స్ అండర్సన్ వీడ్కోలు పలకడంతో అతడిని గౌరవించాలనుకుంది ఈసీబీ. అందుకే.. పటౌడీ ట్రోఫీకి మంగళం పాడి.. భారత లెజెండ్ సచిన్ టెండూల్కర్ పేరును జతచేసింది. ఈ ఏడాది నుంచి సచిన్ – అండర్సన్ ట్రోఫీ నిర్వహిస్తామని ఇంగ్లండ్ బోర్డు తెలిపింది.



# సెట్ లో ఆ స్టార్ హీరోతో పెళ్లైపోయింది..

### 14 ఏళ్ల తర్వాత అసలు విషయం చెప్పిన జెనీలియా.. ఎవరంటే..

తెలుగులో ఒకప్పుడు తోపు హీరోయిన్. అతి తక్కువ సమయంలోనే స్టార్ హీరోస్ అందరి సరసన నటించి మెప్పించింది. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే బాలీవుడ్ స్టార్ రితేశ్ దేశ్ ముఖ్ ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు అబ్బాయిలు. పెళ్లి తర్వాత ఇండస్ట్రీకి దూరంగా ఉండిపోయింది జెనీలియా.చాలా కాలం తర్వాత ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుంది జెనీలియా. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. బాలీవుడ్ హీరోతో సినిమా సెట్ లోనే తనకు పెళ్లి జరిగిందంటూ గతంలో జరిగిన ప్రచారం పై స్పందించింది జెనీలియా. ఆయన వార్తలు ఎవరు సృష్టించారో తనకు తెలుసన్నారు.బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం, తాను గతంలో ఓ ప్రాజెక్ట్ కోసం కలిసి పనిచేశామని.. ఆ సినిమా సెట్ లో అనుకోకుండా తమ పెళ్లి జరిగిందంటూ అప్పట్లో విపరీతమైన ప్రచారం జరిగిందని.. అది కేవలం ప్రచారం మాత్రమే అని.. అందులో ఎలాంటి వాస్తవం లేదని.. తమకు అసలు పెళ్లే జరగలేదని చెప్పుకొచ్చింది.కానీ కొంతమంది పీఆర్ లు ఇలాంటి వార్తలను సృష్టించారని.. కాబట్టి అలాంటి వార్తలు ఎందుకు ప్రచారం చేశారో వారినే అడగాలని తెలిపింది. జెనీలియా, జాన్ అబ్రహం కలిసి పనిచేసిన సినిమా ఫోర్స్, 2011లో విడుదలైన ఈమూవీకి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీ చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరి పెళ్లి జరిగిందనే ప్రచారం నడిచింది.సీన్ లో భాగంగా పంతులుగారు వీరిద్దరికి నిజమైన పెళ్లి చేసేశారని పెద్ద ఎత్తున ప్రచారం నడిచింది. ఇదిలా ఉంటే.. మొదటి సినిమాతోనే నటుడు రితేశ్ దేశ్ ముఖ్ తో ప్రేమలో పడింది జెనీలియా. కొన్నాళ్లపాటు ప్రేమలో ఉన్న వీరిద్దరు పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. చాలా కాలం తర్వాత జెనీలియా అమీర్ ఖాన్ జోడిగా సితారే జమీన్ పర్ చిత్రంలో నటించింది.




# ఓటీటీలోకి మాధవన్ న్యూ ఏజ్ లవ్ స్టోరీ 'ఆప్ జైసా కోయి'..

### స్ట్రీమింగ్ ఎప్పుడంటే.!

స్టార్ నటుడు మాధవన్, బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఆప్ జైసా కోయి' . ఈ సినిమాకు వివేక్ సోని దర్శకత్వం వహిస్తుండగా.. కరణ్ జోహార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు.ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో జూలై 11 నుంచి నేరుగా విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది చిత్రయూనిట్. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సోషల్ మీడియా ద్వారా పరిచయమై 40 ఏళ్ల వ్యక్తితో ప్రేమలో పడిన 30ఏళ్ల మహిళ చుట్టూ ఈ సినిమా కథ ఉండబోతుందని చిత్రబృందం తెలిపింది.

# అతనిలో అన్నీ ఇష్టమే!

నిప్పు లేనిదే పొగరాదు.. మౌనం అర్ధ అంగీకారం.. ఈ ఉవాచలు విజయ్ దేవరకొండ, రష్మికలకు సరిగ్గా సరిపోతాయి. వెకేషన్స్ అంటూ విదేశాలకు చెందిన లొకేషన్లలో వీళ్ల ఫొటోలు విడివిడిగా సోషల్ మీడియాలో దర్శనమిస్తుంటాయి. కానీ కలిసి వెళ్లినట్టు మాత్రం ఎక్కడా కనిపించరు. ప్రేమ, పెళ్లి ప్రస్థావన తెస్తే ఇద్దరూ నర్మగర్భంగానే సమాధానాలిస్తుంటారు. అంతేతప్ప ఇద్దరి మధ్య అనుబంధం ఉందనిగానీ, లేదని గానీ చెప్పరు. ఇరు కుటుంబాల మధ్య రాకపోకలు బాగుంటాయి.సత్సంబంధాలూ కూడా గట్టిగానే ఉంటాయి. కానీ పెళ్లి గురించి మాత్రం నోరు మెదపరు. వీటిని బట్టి ఏం అర్థం చేసుకోవాలో తెలియక సమమతమైపోతుంటారు అభిమానులు. అయితే.. ఆదివారం జరిగిన 'కుబేర' వేడుకలో యాంకర్ సుమ అడిగిన ప్రశ్నలకు సమాధానాలిస్తూ అనుకోకుండా రష్మిక ఓపెనైంది. దీంతో క్లారిటీ ఇచ్చేసిందంటూ చంకలు గుద్దుకుంటున్నారు నెటిజన్లు. వివరాల్లోకెళ్తే.. 'కుబేర' వేడుకలో సుమ అక్కడున్న సెలబ్రిటీలను కొన్ని ర్యాండమ్ క్వశ్చన్స్ అడిగింది. క్రమంలో రష్మికకు కొందరు హీరోల పేర్లు చెప్పి, వీరిలో నచ్చిన అంశాలేంటి? అనడిగితే.. నాగార్జున, ధనుష్, బన్నీల గురించి తన అభిప్రాయాలను వ్యక్తం చేసింది రష్మిక. చివరిగా సుమ అడగాల్సిన పేరునే అడిగేసింది. అదే.. 'విజయ్ దేవరకొండ'. ఆ పేరు వినగానే రష్మిక అందంగా నవ్వుతూ.. 'తనలో అన్నీ ఇష్టమే.. ఎవ్రీథింగ్..' అంటూ 'తనంతా నాకే కావాలి..' అన్నట్టు సమాధానమిచ్చింది. దాంతో అభిమానుల కేరింతలతో ఆడిటోరియం దద్దరిల్లిపోయింది.





# అప్పుడు నటించడమే రాదని ట్రోల్ చేశారు..

### ఇప్పుడు గుండెల్లో గుడి కట్టారు..కుర్రాళ్ల దేవత..

తెలుగులో మొదటి సినిమాతోనే ప్రేక్షకులను కట్టిపడేసింది. అందం, అభినయంతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తక్కువ సమయంలోనే తెలుగులో యంగ్ హీరోల సరసన ఛాన్స్ కొట్టేసింది. ఇప్పుడు కుర్రాళ్ల గుండెల్లో ఈ ముద్దుగుమ్మకు గుడి కట్టేశారు. కానీ ఒకప్పుడు తనకు నటించడమే రాదని ట్రోల్ చేశారట.ఇంతకీ ఈ వయ్యారి ఎవరో తెలుసా.. ? తనే అనుపమ పరమేశ్వరన్. ప్రస్తుతం ఆమె తెలుగులో పరదా సినిమాలో నటిస్తుంది. అలాగే జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ సినిమాలోనూ కనిపించనుంది. ఈ మూవీ విడుదల కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పుడు ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటుంది.తెలుగులో అనేక హిట్ చిత్రాల్లో నటించిన అనుపమ.. మలయాళంలో మాత్రం తక్కువ సినిమాల్లో నటించింది. తాజాగా విషయంపై స్పందించిన అనుపమ.. ఆసక్తికర విషయాలు పంచుకున్నాజానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ వంటి గొప్ప చిత్రంలో ఎంపిక చేశారని.. విమర్శలు తనలో ఆలోచనలు మరింత పెంచాయని.. ప్రేక్షకులకు నచ్చే సినిమాలు మాత్రమే అంగీకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. లాక్ డౌన్ సమయంలో తన కెరీర్ పరంగా, జీవితంలోనూ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని తెలిపింది.తనపై నమ్మకంతో ఇలాంటి పాత్రను ఇవ్వడం తనకు దక్కిన విజయంగా భావిస్తున్నట్లు తెలిపింది. తనకు మద్దతు ఇచ్చినవారికి.. అలాగే తనను ద్వేషించిన వారికి కృతజ్ఞతలు తెలిపింది అనుపమ. ప్రస్తుతం అనుపమ నటిస్తున్న జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ సినిమా జూన్ 27న విడుదల కానుంది. ఇందులో జానకిగా అనుపమ.. లాయర్ గా ప్రముఖ నటుడు సురేష్ గోపి కనిపించనున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492